క్లుప్తంగా

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

సుండుపల్లి: మండల కేంద్రంలో శనివారం అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రామాలలో సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుల్లారెడ్డిపల్లెలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు యర్రపురెడ్డి కృష్ణారెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్ రెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, రెహమాన్ ఖాన్, శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్ర నాయక్, గంగరాజు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



శనేశ్వరస్వామికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

సిద్దవటం: మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో మందగిరి శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి గణపతిపూజ, కలశ స్థాపన, పుణ్యహావాచనం,క్షీరాభిషేకం, తైలాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి స్వామి వారికి తైలాభిషేకం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



హోమం చేస్తున్న వేద పండితులు

రామాపురం: మండల పరిధిలోని దర్బార్‌సాయి అనంత ఆశ్రమంలో కొలువైన శ్రీ సద్గురు దర్గా స్వామిజీ, దర్గామాతాజీ ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజులుగా విశేషంగా జపాలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకి పూజ నిర్వహించారు.

వైద్య శిబిరం విజయవంతం



కోనెయ్యగారిపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పుల్లంపేట: మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి గ్రామంలో శనివారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి సుమారు రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటిచుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ మనోజ్ చంద్ర సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, ముఖ్యంగా దోమలు నీరు నిల్వ ఉన్నచోట వృద్ధి చెందుతాయని, మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సోని, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



దేవపట్ల పశువైద్యకేంద్రం

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల పశువైద్యశాల కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైనుంచి పెచ్చు ఊడుతుండటంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. శనివారం కురిసిన వర్షానికి పైనుంచి పెచ్చులు రాలడమే కాకుండా గదులన్నీ ఊరుస్తున్నాయి. మందులు, రికార్డులు తడిసిపోయాయి. వివిధ గ్రామాల నుంచి నిత్యం రైతులు వైద్యం కోసం పశువులను ఆసుపత్రికి తీసుకువస్తుంటారు. ఈక్రమంలో ఆసుపత్రి భవనం శిథిలా వస్థకు చేరగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

పట్టాల కింద.. పడుతూ లేస్తూ

ఏళ్లు గడుస్తున్నా.. రైల్వే అండర్ బ్రిడ్జికి మోక్షం కలగడం లేదు. అధికారులు పరిశీలించి చేతులు దులుపుకుంటున్నారే తప్పా.. ప్రతిపాదనలు పంపడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఒకటి కాదు రెండు ఏకంగా 15 గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. మోకాలి లోతు నీటిలో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణిస్తున్నారు.

- నీరు చేరితే 15 గ్రామాల వానులకు అగచాట్లు
- ప్రత్యక్ష నరకం చూస్తున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వర్షపునీటితో అధ్వానంగా ఉన్న అండర్ బ్రిడ్జి

ఓబులవారిపల్లె: దశాబ్దాలకాలం క్రితం మండల కేంద్రంలోని బ్రిటీష్ కాలం నాటి రైల్వే గేటును అధికారులు తొలగించారు. ఈ మార్గం గుండా చెన్నరాజుపోడు, వైకోట, గాదెల, తల్లెంవారిపల్లి, జీవిపురం, నూకనపల్లి, వడ్డిపల్లి, బలిజపల్లి, శివశంకరాపురం, ముదిరేపల్లి దాదాపు 15 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా గ్రామం రెండువైపులా గృహాలు ఉన్నాయి. ఒకవైపు పోలీస్ స్టేషన్, ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉండగా.. మరోవైపు రేషన్ షాపులు, బ్యాంకులు, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయం, మీ సేవా, గ్రంథాలయం ఉంది. రైల్వేగేటు గుండానే ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంది. రైల్వే స్టేషన్ విస్తరణలో భాగంగా అప్పటి అధికారులు రైల్వేగేటు తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రత్యామ్నాయంగా కొత్త రైల్వేగేటు కానీ, అండర్ బ్రిడ్జిగానీ ఏర్పాటు చేయలేదు. పున్నాటివారిపల్లి రైల్వేగేటు నుంచి రోడ్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి ఈ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి.

నరకయాతన పడుతున్న ప్రజలు

మోకాలు లోతు వర్షపునీటిలో వృద్ధులు, చిన్నారులు వెళ్లాల్సి వస్తోంది. రైలు పట్టాలు దాటడం ప్రాణాపాయం కావడంతో నడిచి వెళ్లేందుకు గత్యంతరం వర్షపు నీటిలోనే నడవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. అండర్ బ్రిడ్జి వర్షపునీటితో పూర్తిగా నిండితే రాకపోకలు నిలిచిపోతాయి. వెళ్లాలంటే నరకయాతనే, చుట్టూ తిరిగి రావాల్సిందే. సంవత్సరాలుగా రైల్వే అధికారులు, ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి వెళ్తున్నారే తప్పా సమస్యను పరిష్కరించలేదు.నిత్యం ఈ దారిలో అవస్థలు పడుతున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సమస్యను పరిష్కరించండి



అండర్ బ్రిడ్జి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీటితో అండర్ బ్రిడ్జి నిండితే రెండు వైపులా వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాలకు ఈ మార్గం గుండా వెళ్లాలంటే నరకయాతన తప్పదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– వెంకటసుబ్బారెడ్డి, పున్నాటివారిపల్లి, ఓబులవారిపల్లి మండలం

ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డుకు ఆవలివైపు బ్యాంకులు, సచివాలయం, పాఠశాలలు ఉన్నాయి. వాటిని చేరుకోవడానికి నడిచివెళ్లాలంటే వర్షపునీటిలో అవస్థలు పడుతూ వెళ్తున్నాం. నడిచి వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి వెళ్తున్నారే తప్పా సమస్యను పరిష్కరించలేదు.

– షేక్ మస్తాన్ అలీ, ఓబులవారిపల్లె

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతాన్ని తయారు చేస్తున్న దృశ్యం

సిద్దవటం: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ. వీరయ్య తెలిపారు. సిద్దవటం మండలం లోని టక్కోలు రైతుసేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శనివారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వివిధ పథకాలను అమలు చేస్తున్నాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీకృత విధానంలో మిశ్రమ పంటల సాగు చేపడితే సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. విత్తన శుద్ధి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఘన, జీవామృతాలను వినియోగించాలని సూచించారు. దీనివల్ల సాగు ఖర్చులు బాగా తగ్గడంతో పాటు నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని, అంతేకాక భూసారం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం జీవామృతం తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ, డాక్టర్ సాయిమహేశ్వరి టక్కోలు రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



గుంతలమయమైన చిన్నమండెం ఆర్టీసీ బస్టాండు రోడ్డు

చిన్నమండెం : గుంతలు పడి, కంకర తేలిన రోడ్డుపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు కంకర తేలి పెద్దపెద్ద గుంతలతో వాహనదారులకు నరకాన్ని చూపుతున్నాయి. వర్షానికి చిన్నమండెం ఆర్టీసీ బస్టాండు వద్ద రహదారిపై గుంతలు పడ్డాయి. మండల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు చిన్నమండెం ఆర్టీసీ బస్టాండుకు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై బీటీ కొట్టుకుపోయి కంకర తేలింది. మోకాళ్లలోతు గోతులేర్పడ్డాయి. ఈ రోడ్డుపై వాహనదారులు రోజూ ఎక్కడోచోట ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. దీంతో వాహనదారులు హడలిపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బొప్పాయి నర్సరీలతో ఉపాధి



కవర్లలో మట్టి నింపుతున్న మహిళలు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని బొప్పాయి నర్సరీలలో పనులు ఊపందుకున్నాయి. నర్సరీలలో మహిళలకు కవర్లలో మట్టి నింపడం, విత్తనాలు నింపడానికి మహిళా కూలీలకు ఈ సీజన్‌లో డిమాండ్ ఉంటుంది. వర్షాలు పడడంతో రైతులు బొప్పాయి పంటపై దృష్టి సారిస్తున్నారు. ఈ ప్రాంత నర్సరీలలో ప్రతి ఏడాది ఆగస్టు చివరి నుంచి నవంబర్ వరకు 2 కోట్ల బొప్పాయి మొలకలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. బొప్పాయి మొలకలకు ఆర్డర్లు వస్తాయని నమ్మకంతో నర్సరీ నిర్వాహకులు పనులు ప్రారంభించారు. ముందుగా విత్తనాలు విత్తడానికి సారవంతమైన మట్టిని కవర్లలో నింపి సిద్ధంగా ఉంచుతారు. దీనికి రోజుకు 600 రూపాయలు కూలీ ఇస్తారు. మండలంలో 15 నర్సరీలు ఉన్నాయి. ఒక్కొక్క నర్సరీలో 6 లక్షల నుంచి 20 లక్షల వరకు మొలకలు కడప, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, జిల్లాలతోపాటు తమిళనాడు రాష్టానికి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎగుమతి చేస్తుంటారు.

చలో తిరుపతిని జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

రాయచోటి అర్బన్: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సెప్టెంబరు 5న చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి. రమణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చలో తిరుపతి ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 23,500 మంది విద్యుత్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనకు జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులంతా తప్పనిసరిగా హాజరు కావాలంటూ కోరారు. ఈసీడబ్ల్యూయూ డివిజన్ అధ్యక్షుడు నగేష్ గౌడ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



లక్కిరెడ్డిపల్లి : మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి

లక్కిరెడ్డిపల్లి : పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మనం నాటే మొక్కలు భావితరాలకు ఆక్సిజన్ అందిస్తాయని అని చెప్పారు. మొక్కలు విరివిగా పెంచడం వలన కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. అంగన్ వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్టీయూ నాయకుడు పిల్లి రామకృష్ణ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెనగలూరు: ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ పిల్లి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమం ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. ఇప్పుడున్న పరిస్థితిలో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను పెంచడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు.

పుట్టిన ఊరిపై మమకారంతో చేయూత



సిమెంట్ రోడ్డు వేస్తున్న కార్మికులు

పెనగలూరు: పుట్టిన ఊరికి ఏదైనా చేయాలనే తపనతో తలమంచి గిరీష్ రెడ్డి అనే వ్యక్తి సొంత నిధులతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేశారు. శనివారం వెంగతాత మందిరం ప్రక్కన కొలను సమీపంలో రూ.3 లక్షలు నిధులు కేటాయించి సిమెంట్ రోడ్డు పనులు చేపట్టారు. కొత్తపల్లి స్వగ్రామమైన గిరీష్ రెడ్డి అదే గ్రామంలో ఆలయం దగ్గర మట్టి రోడ్డు ఉండటంతో దాన్ని తొలగించి సిమెంట్ రోడ్డు వేశారు. వినాయక ఆలయం, వెంగతాత మందిరం రెండు ఆలయాల మధ్యలో సిమెంట్ రోడ్డు వేయడంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

రుణాలు చెల్లించాలి

సిద్దవటం: డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ప్రతి నెల తప్పకుండా చెల్లించాలని వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని డ్వాక్రా భవనంలో శనివారం మండల సమాఖ్య మహా సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలో ఈసీ సభ్యులు మండల సమాఖ్యకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

ప్రతి పౌరుడు బాధ్యతగా ఉండాలి

వీరబల్లి: ప్రతి పౌరుడు తమ బాధ్యతలు నిర్వర్తిస్తూ.. సమాజానికి కుటుంబానికి సహాయపడాలని తహసీల్దార్ శ్రావణి సూచించారు. శనివారం ఆమె సిబ్బందితో కలిసి మండలంలోని వీరబల్లి పంచాయతీ బొంగావాండ్లపల్లి హరిజనవాడలో పౌరు హక్కులు గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా యువత నేటి సమాజంలో తమ బాధ్యత తెలుసుకొని నడవాలని తెలిపారు.

రాజీమార్గమే రాచమార్గం



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్ : రాజీమార్గమే రాచమార్గమని జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి అన్నారు. శనివారం రాయచోటి కోర్టు ఆవరణలో రాయచోటి నియోజక వర్గ స్థాయిలో పోలీసులు, న్యాయవాదులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆయన లోక్ అదాలత్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జాతీయ లోక అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు ప్రయత్నించాలని సూచించారు. ఈ లోక్ అదాలత్ క్షి దారుల సమస్యల పరిష్కార వేదిక కావాలని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా పొందిన న్యాయం సుప్రీంకోర్టు తీర్పుతో సమానమనే విషయాన్ని క్షి దారులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి సీఎస్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జీసి ఆసీఫా సుల్తాన్, అడిషనల్ జూనియర్స్ జడ్జి డాక్టర్ శారద, న్యాయవాదులు ఎస్. ప్రభాకర్‌రెడ్డి, పి. శ్రీనివాసుల రెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికులకు తప్పని తిప్పలు



చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై నిలిచిన ఆర్టీసీ బస్సు, వేచి ఉన్న ప్రయాణికులు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై శనివారం దేవపట్లమిట్ట సమీపంలో ఆర్టీసీ బస్సు మొరాయించింది. రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం రాయచోటి నుంచి తిరుపతికి వెళుతుండగా దేవపట్ల సమీపంలోని అంబేద్కర్ బాలికల కళాశాల సమీపంలోకి రాగే మొరాయింది. దీంతో వివిధ రకాల పనుల నిమిత్తం వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే డ్రైవర్ ఆర్టీసీ అధికారులకు డ్రైవర్ సమాచారం చేరవేశారు. మరమ్మతులు చేసి యథావిధిగా బస్సును నడిపారు. 2 గంటల పాటు ప్రయాణికులు అవస్థ పడ్డారు. సుదూర ప్రాంతాలకు కండీషన్‌లో ఉండే బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



రాయచోటిలో నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రాయచోటి అర్బన్: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలోని బాలికల వసతిగృహంలో రహస్య కెమెరాల ఏర్పాటు చేసిన నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మాసాపేట శ్రీనివాస ఐటిఐ వద్ద గుడ్లవల్లేరు ఘటనకు నిరసనగా విద్యార్థులు పదర్శన చేశారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాయచోటి నేతలు అప్జల్ బాషా, సమీర్, భరత్, సాగర్, సాజిద్, ప్రసాద్, కిరణ్, శివ, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

రైల్వేకోడూరు అర్బన్: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినుల వాష్‌రూములలో సీసీ కెమెరాలతో వీడియోలు తీసిన నిందితులకు శిక్షించాలని శనివారం జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, ప్రదీప్, రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం



తమ్మిరెడ్డిగారి హృషికేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె : ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని డీవైఈఓ శ్రీరామపురుషోత్తం అన్నారు. మండలంలోని సీటీఎం జెడ్పీహైస్కూల్ గణిత ఉపాధ్యాయులు తమ్మిరెడ్డిగారి హృషికేష్ ఉద్యోగ విరమణ అభినందన సభను శనివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ శ్రీరామపురుషోత్తం, సహ ఉపాధ్యాయులు, అతిథులు తమ్మిరెడ్డిగారి హృషికేష్, ఎస్.నాగమణి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...తమ్మిరెడ్డిగారి హృషికేష్‌ను తోటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, గణిత ఉపాధ్యాయులుగా, హెడ్మాస్టర్‌గా పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి హృషికేశ్ సేవలు అభినందనీయమన్నారు. తమ్మిరెడ్డిగారి హృషికేష్ మాట్లాడుతూ 36 సంవత్సరాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చిందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోని గొప్పదనం మరువలేనిదన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతో సహకరించిన తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి



సంబేపల్లె : భక్తులకు దర్శనమిస్తున్న వీరాంజేయస్వామి



లక్కిరెడ్డిపల్లి : ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

సంబేపల్లె : మండల వ్యాప్తంగా శ్రావణ శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని గుట్టపల్లె, సంబేపల్లె, నల్లగంగమ్మ క్రాస్, పీఎస్ కాలనీ, దుద్యాల, గున్నికుంట్ల, మోటకట్ల, శెట్టిపల్లె, రౌతుకుంట, దేవపట్ల, గ్రామాల్లో ఆంజనేయ స్వామి మూల విరాట్‌లను అలంకరించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా శ్రావణ శనివారం వేడుకలు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా శ్రావణ మాసం నాల్గవ శనివారం వేడుకలు పలు ఆంజనేయస్వామి ఆలయాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకు పూజలు, సింధూర పూజలు, అభిషేక పూజలను నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రత్యేక పూజలు

పుల్లంపేట: మండల పరిధిలోని శ్రీ కోటగడ్డపై వెలసిన అభయాంజనేయస్వామికి శనివారం పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకొని, కాయా కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రాయచోటి-వేంపల్లి రహదారి మార్గంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు, విశ్వభారతి హైస్కూల్ సమీపంలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం, రామాపురం రోడ్డు మార్గంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం నాల్గవ శనివారం గ్రామస్తులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో పూజలు

వీరబల్లి: మండలంలోని మట్లి పంచాయతీ మాండవనది ఒడ్డున వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీధర్ స్వామి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య ఆలయంలో..

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలో వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.